



కర్నూలులో వాహనాల రాకపోకలకు ఇబ్బంది

ఓటింగ్‌లో అటు..ఇటు...

- సార్వత్రిక ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ - ఫలితాలపై కనిపించని ప్రభావం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. ఎమ్మెల్యేకు ఒక పార్టీకి ఓటేసిన వారు ఎంపీకి మరో పార్టీకి ఓటు వేశారు. అయితే క్రాస్ ఓటింగ్ ప్రభావం ఎంపీ అభ్యర్థుల ఫలితాలపై పెద్దగా కనిపించలేదు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ స్థానాలకు ఇటీవల ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రెండు పార్లమెంట్ స్థానాలనూ టిడిపి కైవశం చేసుకోగా 11 అసెంబ్లీ స్థానాలను టిడిపి, ఒక అసెంబ్లీ స్థానాన్ని బిజెపి, రెండు అసెంబ్లీ స్థానాలను వైసిపి దక్కించుకున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎమ్మెల్యే, ఎంపీలకు వచ్చిన మెజారిటీలను పరిశీలిస్తే వ్యత్యాసాలు ఉన్నాయి. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులకు 83,312 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఆలూరు, మంత్రాలయంలో వైసిపి అభ్యర్థులు గెలుపొందారు. ఈ రెండు చోట్ల వైసిపి ఎంపీ అభ్యర్థి బివై.రామయ్యకు 8.260 ఓట్ల ఆధిక్యత వచ్చింది. ఈ లెక్కన టిడిపి ఎంపీ అభ్యర్థికి 75,052 ఓట్ల మెజారిటీ రావాల్సి ఉంది. అనూహ్యంగా 1,11,298 ఓట్ల ఆధిక్యత వచ్చింది. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థుల కన్నా ఎంపీ అభ్యర్థికి 36,246 ఓట్లు ఎక్కువగా పడ్డాయి. నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరికి ఎమ్మెల్యే అభ్యర్థులతో పోలిస్తే మెజారిటీ స్వల్పంగా తగ్గింది. పాణ్యం అసెంబ్లీ అభ్యర్థి గౌరు చరితకు 40,591 ఓట్ల మెజారిటీ రాగా శబరికి 39,432 ఓట్ల ఆధిక్యతే వచ్చింది. ఎమ్మెల్యే అభ్యర్థుల మెజారిటీ 1,12,755 ఓట్లు కాగా ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరికి 1,11,975 ఓట్లే అధికంగా వచ్చాయి. ఎమ్మెల్యే అభ్యర్థుల ఓట్లతో పోలిస్తే శబరికి 780 ఓట్లు తక్కువగా వచ్చాయి. ప్రత్యేకించి శబరికి బనగానపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా 7,648 ఓట్లు తక్కువ వచ్చాయి. శ్రీశైలంలో 3,401, ఆళ్లగడ్డలో 5,505, పాణ్యంలో 1,159 ఓట్లు తక్కువగా వచ్చాయి. మరోవైపు డోన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా ఎంపీకి 6,247 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. నంద్యాలలో ఫరూక్ కన్నా శబరికి 4,723 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. అయితే క్రాస్ ఓటింగ్ ఎంపీ అభ్యర్థుల ఫలితాలపై పెద్దగా ప్రభావం చూపలేదు. కర్నూలు ఎంపీ అభ్యర్థికి మెజార్టీల్లో పెరుగుదల, నంద్యాల అభ్యర్థికి మెజార్టీలో స్వల్ప తగ్గుదల కనిపించింది.

కర్నూలు జిల్లాలో ఇలా...

కర్నూలు ఎమ్మెల్యే టిడిపి అభ్యర్థి టిజి.భరత్‌కు 18,876 మెజారిటీ రాగా ఎంపీ అభ్యర్థికి 18,617, కోడుమూరులో బొగ్గుల దస్తగిరికి 21,583 ఓట్ల ఆధిక్యత రాగా ఎంపీ అభ్యర్థికి 33,065 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఎమ్మిగనూరు టిడిపి అభ్యర్థి బీవీ.నాగేశ్వరరెడ్డికి 15,837 ఓట్ల మెజారిటీ రాగా ఎంపీ అభ్యర్థి నాగరాజుకు 19,219 ఓట్ల ఆధిక్యత లభించింది. ఆదోని నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి పార్థసారథికి 17,464 ఓట్ల ఆధిక్యత రాగా టిడిపి ఎంపీ అభ్యర్థి 19,114 ఓట్ల మెజారిటీ సాధించారు. పత్తికొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబుకు 14,211 ఓట్ల మెజారిటీ రాగా ఎంపీకి 21,825 ఓట్ల ఆధిక్యత లభించింది. మంత్రాలయంలో వైసిపి అభ్యర్థి వై. బాలనాగిరెడ్డి 12,805 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదే వైసిపి ఎంపీ అభ్యర్థి బివై రామయ్యకు 6,788 ఓట్ల మెజారిటీ లభించింది. ఆలూరులో వైసిపి అభ్యర్థి విరూపాక్షి 2,831 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక్కడ వైసిపి ఎంపీ అభ్యర్థి బివై రామయ్యకు 1472 ఓట్ల ఆధిక్యతే లభించింది.

నంద్యాల జిల్లాలో ఇలా...

డోన్ టిడిపి అభ్యర్థి కోట్ల జయసూర్యప్రకాశడ్డికి 6,049 ఆధిక్యం రాగా నంద్యాల టిడిపి ఎంపీ అభ్యర్థి శబరికి 12,296 ఓట్ల మెజారిటీ వచ్చింది. నంద్యాల అసెంబ్లీ టిడిపి అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్‌కు 12,333 ఓట్ల మెజారిటీ రాగా ఎంపీ అభ్యర్థికి 17,056 ఓట్ల మెజారిటీ లభించింది. ఆళ్లగడ్డ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి భూమా అఖిలప్రియ 12,037 ఓట్ల మెజారిటీ రాగా శబరికి 6,532 ఓట్ల మెజారిటీనే వచ్చింది. బనగానపల్లి అసెంబ్లీ టిడిపి అభ్యర్థి బిసి జనార్ధన్ రెడ్డికి 25,568 మెజారిటీ రాగా ఎంపీ అభ్యర్థికి 17,920 ఓట్ల ఆధిక్యత వచ్చింది. నందికొట్కూరు టిడిపి అభ్యర్థి జయసూర్యకు 9,792 మెజారిటీ రాగా ఎంపీకి 9,942 ఓట్ల ఆధిక్యత లభించింది. శ్రీశైలంలో టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డికి 6,385 ఓట్ల మెజారిటీ రాగా శబరికి 2,984 ఓట్ల ఆధిక్యతే వచ్చింది.



విస్తారంగా వర్షం

- తుగ్గలి మామిళ్లకుంట మధ్య రాకపోకలకు అంతరాయం
- వెల్దుర్తిలో కూలిన మట్టిమిద్దె - కర్నూలులో పొంగిపొర్లిన నాళాలు, కల్వర్టులు

ప్రజాశక్తి-విలేకరులు

కర్నూలు, నంద్యాల జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. కర్నూలు, నంద్యాల నగరాల్లో భారీ వాన కురిసింది. దీంతో రోడ్లపై వర్షపు నీరు పెద్ద ఎత్తున ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరాయి. పాములపాడు మండలంలో ఇస్కాల గ్రామ సమీపంలో ఉన్న బనవాసి వాగు పొంగి పొర్లింది. హాలహర్వి ఎస్‌సి కాలనీ పక్కన పెద్దవాగు పొంగి పొర్లడంతో ఇళ్లలోని నీరు చేరింది. కర్నూలు జిల్లా తుగ్గలి మామిళ్లకుంట మధ్య రోడ్డుతెగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెల్దుర్తిలో మట్టిమిద్దె కూలి నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు పాడయి రూ. రెండు లక్షలదాకా నష్టం వాటిల్లింది. అందరూ బయటి గదిలో ఉన్నందున ప్రాణాపాయం తప్పింది. కర్నూలు నగరంలో వర్షానికి రోడ్లన్ని దెబ్బతిన్నాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

తుగ్గలి: తుగ్గలిలో శుక్రవారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. తుగ్గలిలో 56.2 వర్షపాతం నమోదయింది. తుగ్గలి చెరువులోకి భారీగా నీరు చేరాయి. మామిళ్ల కుంట తుగ్గలి రోడ్డు పూర్తిగా తెగిపోయింది. రైల్వే బ్రిడ్జిలోకి నీరు ఎక్కువగా చేరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఊరు చుట్టూ ప్రక్క భారీ వర్షం రావడంతో చిన్న చిన్న కుంటలు నీరు చేరిపోయాయి. మామిళ్ల కుంట రోడ్డు తెగిపోవడం తో తుగ్గలి మామిళ్ళకుంటకు రాకపోకలు నిలిచిపో యాయి. మామిళ్ల కుంటికి పోయే ప్రజలు పత్తికొండ, ఎద్దులదొడ్డి, కోతి కొండమీదగా గ్రామానికి చేరుకుంటున్నారు. రైల్వే బ్రిడ్జి కింద నీరు అధికంగా ఉండడంతో బ్రిడ్జి దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెల్దుర్తి: వెల్దుర్తి పట్టణంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 13వ వార్డులో నివాసముంటున్న షబానా(35)కు చెందిన మట్టిమిద్దే కూలింది. పాతమిద్దె కావడంతో వారు బయట సోఫాలో నిద్రిస్తుండగా లోపల ఉన్న వంట రూము హాలు పై కప్పులు పడిపోయాయి. బయట నిద్రిస్తుండడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. వంటగది పడిపోవడంతో గదిలో ఉన్న వంట సామాగ్రి ధాన్యం నానిపోయాయని బాధితులు తెలిపారు. రూ.రెండు లక్షల మేర నష్టం జరిగిందని ప్రభుత్వం వారిని ఆదుకోవాలని బాధితులు కోరారు.

కర్నూలు అగ్రికల్చర్ : నిత్యం కురుస్తున్న వర్షాలు నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందే అంతంతమాత్రంగానే ఉన్న రోడ్లు కాలువలు కల్వర్టులు దెబ్బతిని కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లలేని దుస్థిల్లో రహదారులున్నాయి. కర్నూలు నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతుంది. వర్షం కురిసిన ప్రతి రోజు ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు. కర్నూలు నగరంలో నంద్యాల చెక్ పోస్టు, నందికొట్కూరు రోడ్డులో, సంతోష్ కల్యాణ మండపం దగ్గర కల్వర్టులు ముసుకుపోయి నిత్యం వాహనదారులు కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది ద్విచక్రవాహనంపై కిందపడి గాయాలపాలయ్యారు. మహిళలు స్కూటీలలో వెళ్తున్న వారు కిందపడిన ఘటనలు ఉన్నాయి. వీటిని గుర్తించి నియంత్రించేందుకు సంబంధ అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. ఈ ఏడాది అధికంగా వర్షాలు ఉన్నాయని వాతావరణ అధికారులు తెలుపుతున్న రోడ్ల దుస్థితి గురించి ప్రయాణికుల అవస్థలు గురించి పట్టించికునే నాధుడు కరువయ్యారు. నగరంలో చెక్ పోస్టులో, ఆనంద్ కాంప్లెక్స్ దగ్గర బ్రిడ్జి కింద, అశోక్ నగర్ బ్రిడ్జి కింద, జోహారపురం రోడ్లో హౌసింగ్ బోర్డు కాలనీ దగ్గర, ఇలాంటి ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బ తిన్న ప్రాంతాలు గుర్తించి వెంటనే మరమ్మతులు చేసి వాహనదారుల ప్రాణాలు కాపాడాలని నగర ప్రజలు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో వర్షపాతం నమోదయింది. హాలహర్వి 52.4, ఓర్వకల్43.0, హోళగుందా 42.4,కర్నూలు అర్బన్ 20.2, కర్నూలురూరల్ 13.4, నందవరం 10.8, పెద్దకడుబూరు 8.4, కౌతాళం 6.4, ఆలూరు 6.4, గోనెగండ్ల5.6, కల్లూరు 4.0, అస్పరి3.6 ఇలా జిల్లాలో పలు మండలాల్లో వర్షపాతం నమోదయింది.



వెల్దుర్తిలో కూలిన మట్టిమిద్దె



తుగ్గలి : మామిళ్లకుంట వద్ద తెగిపోయిన రోడ్డు

సస్పెన్షన్ ఉత్తర్వులు ఎత్తివేయాలి

- డిఆర్ఒకు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నేతల వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులకు గైరహాజరైన ఉద్యోగులను, ఉపాధ్యాయులను సస్పెండ్ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలని ఎపి ఉద్యోగ ఉపాధ్యాయ ఐకాస జిల్లా చైర్మన్ సిహెచ్ వెంగల్ రెడ్డి, జవహర్లాల్, డిఆర్ఓను కోరారు. ఎన్నికల కోడ్ కూడా ముగియడంతో వెంటనే సస్పెన్షన్ ఉత్తర్వులను ఎత్తివేయాలని విన్నవించారు. శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావును ఉద్యోగ ఉపాధ్యాయ ఐకాస చైర్మన్ సిహెచ్ వెంగల్‌రెడ్డి, జవహర్లాల్ ఇతర సంఘాల నేతలు గోకారి, రవికుమార్, గట్టు తిమ్మన్న, మరియానందం, మద్దిలేటి కాశన్న తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల విధులకు గైర్హాజరైన వారిలో వంద మందికి పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వీరందరినీ సస్పెండ్ చేశారు. ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు సహకరించారని పేర్కొన్నారు. సస్పెండ్ చేసిన ఉద్యోగుల ఉపాధ్యాయుల ఉత్తర్వులను ఎత్తివేసి విధుల్లోకి తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జాగ్రత్తగా ఉండండి...

- ఆదమరిస్తే అనంతలోకానికి
- ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఉమాపతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, ఆదమరిస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని, జాగ్రత్తగా ఉండాలని ఎపి ఎస్‌పిడిసిఎల్ కర్నూలు పర్యవేక్షక ఇంజనీర్ (ఎస్ఇ) ఎం.ఉమాపతి హెచ్చరించారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ వర్షాకాలంలో ఇటీవల విద్యుత్ ఘాతంతో ఇద్దరు మృతిచెందిన సంఘటనలు పత్రికల ద్వారా తెలిసింది. బనగానపల్లెలో గని కార్మికుడు మోటార్‌ను ఆన్ చేయబోయి మృతిచెందారన్నారు. బేతంచెర్లలో ఈశ్వరమ్మ రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న ఇంట్లో తడిచేత్తో స్విచ్ ఆన్ చేయడంతో మృతి చెందింది. ఇలాంటి సంఘటనలు జరగకుండా విద్యుత్ వినియోగదారులు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గాలితో కూడిన వర్షం పడే సమయంలోతీగలు తెగి పడితే ఎవరు కూడా తీగల వద్దకు పోకూడదని, పచ్చి కర్రలతో తాకరాదని చెప్పారు. విద్యుత్తు వినియోగించే సమయంలో తడిచేతులతో తాకరాదని చెప్పారు. వర్షం కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలకు సపోర్టుగా ఉన్న తీగలను కూడా తాకకూడదని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో తీగలు కిందికి వేలాడుతుండగా వాటిని కూడా తాగరాదని పొరపాటున కూడా పచ్చికర్రలతో తాకిన కూడా ప్రమాదం జరిగి ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందన్నారు. ఇండ్లలో వాడే విద్యుత్తు పరికరాలను కూడా జాగ్రత్తగా వాడుకోవాలని, ఆన్ చేసిన తర్వాత అప్రమత్తంగా పట్టుకోవడం లాంటివి చేయకూడదన్నారు. స్విచ్ ఆఫ్ చేశాక మాత్రమే వాటిని ముట్టుకోవాలన్నారు. వర్షం పడే సమయాల్లో చెట్ల కింద కూడా ఉండకూడదన్నారు. విద్యుత్ కనెక్షన్ తీసుకున్న ప్రతి ఇంటికి ఎర్త్‌ను పెట్టుకోవాలని, ఎర్త్ పెట్టుకొని పక్షంలో వర్షాలు పడే సమయంలోగాలి ఉన్నట్లయితే తీగలు ఒకదానికొకటి తగిలి, ఇండ్లలో ఉన్న టివిలు కాలిపోయే అవకాశం ఉందన్నారు. వర్షం పడే సమయంలో ఉరుములు మెరుపులు ఉన్నట్లయితే వెంటనే టీవీలకు ఉన్న కనెక్షన్లను తీసివేయాలన్నారు. లేనిపక్షంలో ఫ్రిజ్లు, టివి పిక్చర్ ట్యూబ్‌లు కూడా కాలిపోయే అవకాశం ఉందన్నారు. వర్షం పడే సమయాల్లో గాలికి చెట్లు విరిగి తీగలపై పడిన, స్తంభాలు విరిగిపడిన వెంటనే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని, లేదా సంబంధిత ఎఇకి ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.



ఇ- డిజిటల్ ఓపి కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇ-డిజిటల్ ఓపి కౌంటర్‌ను కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇ-డిజిటల్ ఓపి కౌంటర్ ప్రారంభించామని తెలిపారు. ఆసుపత్రికి ప్రతిరోజు దాదాపుగా 3000 మంది ఔట్ పేషెంట్లు వస్తుంటారని, ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఓపి కౌంటర్లు 4 పీడియాట్రిక్ , గైనిక్ విభాగాలలో ఓపి కౌంటర్లు ఉన్నా ఇంకా రద్దిగా ఉండడంతో కొత్త కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. దీని వలన రోగులకు క్యులైన్లలో కూర్చొని ఎక్కువ సేపు సమయాన్ని వృధా చేయకుండా వారి స్మార్ట్ ఫోన్ ద్వారా డిజిటల్ స్కాన్ అండ్ షేర్ ద్వారా ఎటిఎం ఫోన్ పే ఆభా యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఓపి టోకెన్ నెంబర్ ద్వారా ఓపి జనరేట్ అయితుందన్నారు. ఆసుపత్రిలో ఇవి కాకుండా అదనంగా మరో రెండు ఓపి కౌంటర్లు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.



ఇ-డిజిట్ ఓపి కౌంటర్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ , సూపరిన్‌టెన్‌డెంట్



అభినందిస్తున్న అవాజ్ కమిటీ నాయకులు

నీట్‌లో ప్రతిభ చూపిన సానియా దేశాయి

అవాజ్ కమిటీ అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన సానియా దేశాయిని ఆవాజ్ నాయకులు ఘనంగా సన్మానించారు. కర్నూలు నగరంలోని పాతబస్తీ నందు నివాసం ఉండే సిపిఎం నాయకులు అబ్దుల్ దేశాయి కుమార్తె అయిన సానియా దేశాయి నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి అత్యధికంగా మార్కులను సాధించిన సందర్భంగా ఆమె ప్రతిభను కొనియాడుతూ ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఇలియాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆవాజ్ నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పి. ఇక్బాల్ హుస్సేన్, షేక్ మొహమ్మద్ షరీఫ్‌మాట్లాడారు. ఉద్యమాలు పోరాటాలతో పాటు చదువులో కూడా రాణించడానికి తమ పిల్లలకు ప్రోత్సాహాన్ని ఏ రకంగా ఇస్తున్నారో మన సానియా దేశాయిని చూసి తెలుసుకోవచ్చున్నారు. ఇటువంటి ప్రతిభా కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు గతం నుండి ఆవాజ్ కమిటీ ప్రోత్సహిస్తుందని తెలిపారు. అందులో ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తారని , రాబోయే కాలంలో ఇటువంటి ఉత్తమ ఫలితాలు ఇంకా ఎన్నో సాధించాలని కోరుకుంటున్నారు. సిపిఎం నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్, ఆవాజ్ నగర ఉపాధ్యక్షులు రశీదా దేశాయి, ఖాజా పాషా, చాంద్ బాషా ,డాక్టర్ సలీం ఆర్ఎంపి, హర్షద్, సాదిక్ బాషా పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గత 12 రోజులుగా సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ముజఫర్ నగర్ లోని టిసి లక్ష్మమ్మ కుట్టు శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెఎన్. శేషయ్య ముజఫర్ నగర్ అభివృద్ధి కమిటీ నాయకులు కె.సుధాకరప్ప విద్యార్థులకు సర్టిఫికెట్లు ,పెన్నులను అందజేశారు. గత 12 రోజులుగా నిర్వహించిన ట్యూషన్ సెంటర్లో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ఎం.జయరాజు, జిల్లా ఉపాధ్యక్షులు జి.హేమంత్ కుమార్, జిల్లా కౌన్సిలర్ డి.రాముడు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ఎంపి బసవరాజు, వెంకటేశ్వర్లు విద్యార్థులకు సైన్స్, గణితం, ఇంగ్లీష్, తెలుగు కథలు గ్లామర్ నీతి కథలు పాటలు తదితర వాటిని విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెఎన్. శేషయ్య అభివృద్ధి కమిటీ నాయకులు కె.సుధాకరప్ప మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలలో భాగంగా గత 12 రోజులుగా నిర్వహించిన ట్యూషన్ సెంటర్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. దాదాపు 35 మంది విద్యార్థులు ఇక్కడ తమకు అవసరమైన వాటిని టీచర్ల ద్వారా నేర్చుకోగలిగారని తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాల వల్ల విద్యార్థులు తమ విద్యను పాఠశాలలకు వెళ్ళే సందర్భంగా సులభతరం చేసుకోవడానికి మంచి విద్యార్థులుగా తయారు కావడానికి విజ్ఞానాన్ని వికాసాన్ని గురువుల పట్ల తోటి విద్యార్థుల పట్ల ఎలా మెలగాలి అనే అంశాలు నేర్చుకోగలిగారని తెలిపారు. అంతేకాకుండా సమాజం పట్ల విద్యార్థులకు ఉండవలసిన అవగాహన , జ్ఞానాన్ని పెంచడం కోసం కూడా ఈ శిబిరాలు ఉపయోగపడ్డాయని తెలిపారు. ఈ శిబిరం నిర్వహణకు అనేకమంది సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ శిబిరం జయప్రదం చేసిన ఉపాధ్యాయులకు విద్యార్థులకు తల్లి దండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో అభివృద్ధి కమిటీ నాయకులు ఎంసి ఆనందు ఎం.దావీదు, ఎస్.ముక్తియార్, ఎస్.శారదమ్మ, ఎస్. బషీర్ అహ్మద్ తదితరులు హాజరయ్యారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న నిర్వహకులు

మెడికవర్‌లో బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెడికవర్ హాస్పిటల్స్‌లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం అందరం కలిసి, మెదడు కణితుల ద్వారా ప్రభావితమైన వారి జీవితాల్లో మార్పు చేయవచ్చు (Together, we can make a difference in the lives of those affected by brain tumors) అనే నినాదంతో ప్రజలలో అవగాహనా కల్పించటానికి ఈ కార్యక్రమం నిర్వహించారు. దీని ఉద్దేశ్యం ఏమిటంటే బ్రెయిన్ ట్యూమర్ వంటి తీవ్రమైన సమస్య గురించి ప్రజలు తెలుసుకోవాలి. తద్వారా దానిని నివారించవచ్చు. అందుకే వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని అంటున్నారు. మెడికవర్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, డాక్టర్ కెఎస్.విశ్వాకుమార్ బ్రెయిన్‌లోని కణితుల సమీపంలో కణజాలం, నిర్మాణాలలో వచ్చే గడ్డలు, కణాల పెరుగుదలనే బ్రెయిన్ ట్యూమర్స్ అంటారని చెప్పారు. వీటిలో కొన్ని కాన్సర్స్‌తో సంబంధం లేనివి. మరికొన్ని కాన్సర్‌తో సంబంధం ఉన్నవి. బ్రెయిన్ ట్యూమర్ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. దీర్ఘకాలం పాటు రేడియేషన్ కు గురయ్యే వ్యక్తులు, పొగతాగే వ్యక్తులు బ్రెయిన్ ట్యూమర్‌లను అభివృద్ధి చేసే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. బ్రెయిన్ ట్యూమర్ చాలా ప్రమాదకరమైన వ్యాధి. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయం తప్పదు. ఏ మాత్రం అనుమానం వచ్చినా వైద్యులను సంప్రదించాలని లేకపోతే ప్రాణాల మీదకి తెచ్చుకున్నవారవుతారు. ఓ వ్యక్తి బ్రెయిన్‌లోని ట్యూమర్ రకం, పరిమాణం, స్థానం, పెరుగుదల రేటు ప్రకారం మారుతూ ఉంటాయి. వీటి లక్షణాలను గుర్తించడం కష్టం. ఎందుకంటే అవి ఇతర అనారోగ్య సమస్యల్లానే ఉంటాయి.

వ్యాధి లక్షణాలు: తలనొప్పి, తలలో ఒత్తిడి, ఉదయం సమయంలో తీవ్రమైన తలనొప్పి పడుకున్నప్పుడు తలనొప్పి ఎక్కువ అవడం, వికారం, వాంతులు ఏవైనా రెండుగా కనిపించడం. కణితి ఉన్న ప్రదేశాన్ని బట్టి లక్షణాలు మారుతాయి. కొన్నిసార్లు మూర్ఛ, కంటి సమస్యలు, మాటలు సరిగ్గా మాట్లాడలేకపోవడం, సరిగ్గా నడవలేకపోవడం, ముఖం ఓ వైపు తిరిగిపోవడం, ప్రవర్తనలో మార్పు, మతిమరపు లాంటివి కనిపిస్తాయి. మెదడులోని కణితి పరిమాణాన్ని బట్టి స్థలాన్ని ఆక్రమిస్తుందని. కణితి పెరిగిన కొద్ది మెదడు కణజాలంపై ఒత్తిడి పెరుగుతుంది. వీటిని గుర్తించడానికి ఎంఆర్ఐ చేయించుకోవాలి.





టిజి.భరత్‌ను షాలువా, బొకేతో అభినందిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

టిజి.భరత్‌కు డాక్టర్ శంకర్‌శర్మ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన టిడిపి ఎమ్మెల్యే టిజి.భరత్ కు డాక్టర్ శంకర్ శర్మ శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కర్నూలులో ఎన్నో సేవా కార్యక్రమాలు టిజి. వెంకటేష్ టిజి.భరత్ చేస్తున్నారని డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ అన్నానరు. కర్నూలులో క్రీడలకు ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారని, జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిని ఘనంగా నిర్వహిస్తున్నారంటే టిజి సంస్థల ప్రోత్సాహమేఅని తెలిపారు. ఎమ్మెల్యేగా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నా వంతు సహాయం కూడా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టి ముందుకు పోతున్నామన్నారు. క్రీడా సంఘాలకు అనాథశరణాలయాలకు, వృద్ధులకు నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. డాక్టర్ శంకర్ శర్మతోపాటు హాస్పిటల్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

అభివృద్ధి చేయడమే టిడిపి లక్ష్యం

మాజీ జడ్‌పి చైర్మన్ బత్తిన వెంకట రాముడు

ప్రజాశక్తి- తుగ్గలి

గ్రామీణ పట్టణ ప్రాంతాలలో అభివృద్ధి చేయడమే టిడిపి లక్ష్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ జడ్‌పి చైర్మన్ బత్తిన వెంకటరాముడు అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో ఘన విజయం సాధించడంతో వివిధ ప్రాంతాల నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం రామలింగయ్య పల్లెకు వచ్చి బత్తిన వెంకట రాముడును శాలువా పూలమాలతో సన్మానించారు. కేక్ కట్ చేసి విజయోత్సవాలు నిర్వహించారు. బత్తిన వెంకట రాముడు మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి రాష్ట్ర ప్రజలు టిడిపిని అఖండ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. ప్రస్తుతం పత్తికొండ ఎమ్మెల్యేగా కెఇ.శ్యాం కుమార్, ఎంపీగా నాగరాజు విజయం సాధించడంతో మరింత అభివృద్ధిసాధ్యమని తెలిపారు. దేవేంద్ర,బత్తిన కిరణ్ ,మాజీ ఎంపిపి కొమ్ము వెంకటేష్, టిడిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటపతి, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలకు నేనున్నాను

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



ప్రజాశక్తి - మంత్రాలయం

వైసిపి నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, తానున్నానని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం మండలంలోని రాంపురం గ్రామంలోని స్వగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసిపి పరాజయం చవి చూసిందని తెలిపారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 2014లోనే ఎన్నో పోరాటాలు చేశామని, ఇప్పుడు కూడా అదే తరహాలోనే నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని కోరారు. నాయకులకు, కార్యకర్తలకు ఎప్పుడు, ఎలాంటి ఇబ్బంది కలిగినా నేరుగా కలవచ్చని తెలిపారు. లేదా తనకు ఫోన్ ద్వారా సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. తనతో పాటు తన సోదరుడు వై.సీతారామిరెడ్డి, కుమారులు వై.ప్రదీప్ రెడ్డి, వై.ధరణీ రెడ్డి, ఆయా మండలాల నాయకులు, గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు అందుబాటులో ఉంటామని తెలిపారు.

ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - కౌతాళం


బాలనాగిరెడ్డిని సన్మానస్తున్న దాట్ల యూత్

మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని కౌతాళం సింగిల్ విండో అధ్యక్షులు దాట్ల కృష్ణంరాజు సన్మానించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించడంతో శుక్రవారం ఆనందం వ్యక్తం చేశారు. బాలనాగిరెడ్డికి, వై.ప్రదీప్ రెడ్డికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు దాట్ల కృష్ణంరాజు, గురు రాఘవేంద్ర రెడ్డి, గణపతిరాజు, యువ నాయకులు సుబ్బరాజు, ఉలిగప్ప, ఆనంద్, ఉపేంద్ర, మోదిన్, దాట్ల యూత్ పాల్గొన్నారు.

క్రైస్తవ సమాజాభివృద్ధికి సహకరించాలి

- మీనాక్షి నాయుడుకు క్రైస్తవులు అభినందన

ప్రజాశక్తి - ఆదోని


మీనాక్షి నాయుడును అభినందిస్తున్న క్రైస్తవులు

ఆదోనిలోని క్రైస్తవ సమాజాభివృద్ధికి సహకరించాలని ఆదోని క్రైస్తవ అసోసియేషన్ సభ్యులు, క్రైస్తవ సంఘ పెద్దలు, గురువులు కోరారు. శుక్రవారం ఆదోనిలోని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడును ఆయన స్వగృహంలో కలిసి టిడిపి గెలుపుపై అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. గతంలో ఆదోనిలో క్రైస్తవులకు అనేక విషయాల్లో ప్రభుత్వం ద్వారా సహాయ, సహకారాలు అందించామని తెలిపారు. ఇప్పుడు కూడా అన్ని విషయాల్లోనూ క్రైస్తవులకు ప్రభుత్వం ద్వారా కచ్చితంగా సహకారం ఉంటుందని అన్నారు. పాస్టర్లు శాంతన్న, జకర్య, జెస్సీ భాస్కర్, శరత్ బాబు, ఆశీర్వాదం, జయపాల్, జాన్, ఇమ్మానుయేలు, రాజన్న, ప్రకాష్, సామ్యేల్, శాంత రాజా, సంఘ పెద్దలు సునీల్ రాజ్ కుమార్, జెర్మియ పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన జనసేన : మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అభ్యర్థులు విజయ ఢంకా మోగించి చరిత్ర సృష్టించారని జనసేన ఇన్‌చార్జ్ మల్లప్ప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శ్రీనివాస భవన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక కార్యాలయం నుంచి బైక్‌పై ర్యాలీగా వెళ్లి అక్కడ పవన్ కల్యాణ్ కు అనుకూలంగా నినాదాలు చేశారు ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడారు. పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ జనసేన అభ్యర్థులు గెలుపొందడం చారిత్రాత్మకమని తెలిపారు. కూటమి ఆధ్వర్యంలో ఏర్పడే ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మల్లప్ప

గత ప్రభుత్వంలో రేషన్ డీలర్ల వ్యవస్థ నిర్వీర్యం

- డీలర్ల సంఘం పట్టణ అధ్యక్షులు మహబూబ్ బాష

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత వైసిపి ప్రభుత్వంలో రేషన్ డీలర్ల వ్యవస్థ నిర్వీర్యమైందని రేషన్ డీలర్ల సంఘం పట్టణ అధ్యక్షులు ఎస్.మహబూబ్ బాష, ఉపాధ్యక్షులు ఈరన్న తెలిపారు. శుక్రవారం రేషన్ డీలర్ల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్‌డియు ఆపరేటర్లు రేషన్ పంపిణీ చేయగా వచ్చిన కమీషన్‌పై ఆధారపడి జీవనం కొనసాగించామని తెలిపారు. ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు అంటూ, వాహనాలను తిప్పుకుంటూ, చాలామందికి సరుకులు అందేవి కావని చెప్పారు. వీధిలో ఒకచోట వాహనాన్ని ఆపి పంపిణీ చేపట్టడంతో, సందుల్లో ఉన్నవారికి వాహనం వచ్చింది, లేనిది తెలియక, సరుకులు అందక ఇబ్బంది పడేవారని తెలిపారు. ఎమ్‌డియు ఆపరేటర్లు పంపిణీపై డీలర్ల కమీషన్ ఆధారపడి ఉండడంతో, చాలీచాలని కమీషన్‌తో ఇబ్బందులు పడ్డామని వాపోయారు. ఎమ్‌డియులకు మాత్రం రేషన్ పంపిణీ కమీషన్‌తో సంబంధం లేకుండా గౌరవ వేతనం అందించారన్నారు. కమీషన్‌లో రేషన్ డీలర్ల షాపు బాడుగలకు, విద్యుత్ చార్జీలకు, ఖర్చులు పోగా డీలర్‌కు చివరికి రూ.2 నుంచి రూ.3 వేల వరకు మాత్రమే మిగిలిందన్నారు. కుటుంబం గడవక పస్తులుండే పరిస్థితి ఏర్పడిందన్నారు. యువగళం పాదయాత్రలో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్ల పరిస్థితులపై లోకేష్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. రేషన్ డీలర్లకు కూడా రాష్ట్రవ్యాప్తంగా ఒకే కమీషన్, ఒకే రేషన్ పద్ధతిని కానీ, గౌరవ వేతనం కానీ అందించాలని కోరారు. డీలర్ వ్యవస్థను కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డికి విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే బీవీకి శుభాకాంక్షలు తెలియజేసి శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించారు. అనంతరం రేషన్ డీలర్ల సంఘం నూతన కమిటీలో సెక్రటరీగా ఎమ్‌డి.షేక్, జాయింట్ సెక్రటరీగా అఫ్జల్ బాష, ట్రెజరరీగా ఖాజా, సభ్యులుగా నటరాజ్, తాయప్ప, ఫొటో శీనా, చంద్రశేఖర్, శివ కుమార్, పాల ఈరన్న, నాగూర్ బాష, రాఖీభూ, సురేంద్ర గౌడ్, రంగన్న ఎన్నికయ్యారు.


మాట్లాడుతున్న డీలర్ల సంఘం నూతన కమిటీ సభ్యులు


దర్గాలో పూజలు చేస్తున్న నాయకులు

రాష్ట్రాభివృద్ధి కోసం టిడిపికి పట్టం కట్టారు

- తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజలు టిడిపికి పట్టం కట్టారని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి రావడంతో శుక్రవారం శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా ఫాతేహాలు చేపట్టారు. అనంతరం సురేష్ నాయుడు మాట్లాడారు. జగన్ పాలనలో అభివృద్ధి లేక రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనకబడిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాలను అభివృద్ధిలోకి తీసుకురావడం చంద్రబాబు నాయుడుకే సాధ్యమని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి వైపు తీసుకెళ్తామన్నారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, నీలకంఠ రెడ్డి, రాజానందు, రహిమాన్, మంజు పాల్గొన్నారు.

వాగు నుంచి రక్షణ కల్పించండి

- కాలనీవాసుల వినతి


ఇళ్లలోకి ప్రవహిస్తున్న వరద నీరు

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి ఎస్సీ కాలనీకి వాగు నుంచి రక్షణ కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎస్సీ కాలనీ పక్కనే ఉన్న పెద్ద వాగు పోటెత్తడంతో పశుగ్రాసం కొట్టుకుపోయి నష్టం వాటిల్లింది. అనేక ఇళ్లలోకి నీరు చేరింది. వరద నీరు ప్రజల ఇళ్లలోకి ప్రవేశించడంతో ప్రజలు మేల్కొని తమ ఆవరణలోని నీటిని బయటకు పంపడం ప్రారంభించారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల తర్వాత నీరు తగ్గుముఖం పట్టింది. రాత్రిళ్లు వర్షం తీవ్రత ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపారు. వారి కాంపౌండ్, గదుల్లో కూడా దాదాపు 1, 2 అడుగుల నీరు పేరుకుపోయింది. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా కూడా చాలా సేపు నిలిచిపోయింది. వాగులో ఉన్న కంప చెట్లను తొలగించి తమ కాలనీకి ముప్పు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

- చెత్తాచెదారం తొలగింపు

ప్రజాశక్తి - చిప్పగిరి

'గ్రామ ప్రధాన రచ్చ కట్టకిరువైపులా చెత్తాచెదారం తొలగించండి' అనే శీర్షికన శుక్రవారం ప్రజాశక్తి పత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు, సర్పంచి స్పందించారు. శుక్రవారం బంటనహాల్ గ్రామంలో సర్పంచి, సచివాలయ అధికారులు వెంటనే స్పందించి ప్రధాన కూడలిలో ఉన్న రచ్చకట్టకిరువైపులా ఉన్న చెత్తాచెదారం, కంకర తొలగింపు కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులు, మహిళలు, వృద్ధులు మంచి పనులు చేశారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


చెత్తాచెదారం, కంకరను తొలగిస్తున్న సిబ్బంది



ముందుచూపు గల నాయకుడు లోకేష్ : ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

యువగళం యాత్రతో యువకుల్లో నూతనోత్తేజం నింపి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన నాయకుడు లోకేష్ అని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. శుక్రవారం ఉండవల్లిలో నారా లోకేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం, శాలువా కప్పి సన్మానించారు. ఆదోనిలో ఎన్‌డిఎ కూటమి తరపున బిజెపి అభ్యర్థి పార్థసారథిని గెలిపించడం పట్ల అభినందించారని ఉమాపతి నాయుడు తెలిపారు. టిడిపి బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని సూచించారన్నారు. నియోజక వర్గంలో యువగళం పాదయాత్రను విజయవంతం చేశారని గుర్తు చేశారని తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - గోనెగండ్ల

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని, బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు గోనెగండ్ల సిఐ రామకృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. పోలీసు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి గోనెగండ్ల గ్రామం బయట ఎల్‌ఎల్‌సి కెనాల్ వద్ద బొలేరో వాహనంలో అక్రమంగా 30 బాక్సుల్లో తరలిస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన 2880 జాన్స్ ఒరిజినల్ ఛాయిస్ 90 ఎంఎల్ టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం తరలించడానికి ఉపయోగిస్తున్న బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. అక్కడి నుంచి పారిపోయిన పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన మిన్నెల్లా, అతని బంధువు పులకుర్తి గ్రామానికి చెందిన షేక్షావలీపై కేసు నమోదు చేశామన్నారు.

కుంభకోణాలకు నిలయంగా జగన్ పాలన

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

ఇసుక, మద్యం, ఖనిజ సంపదను దోచుకొని రూ.కోట్లకు పడగలెత్తి కుంభకోణాలకు పాల్పడి, అక్రమాలకు నిలయంగా వైసిపి పాలన సాగిందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. శుక్రవారం ఆదోనిలో ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన మాట తప్పనని గొప్పలు చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డి మద్యపాన నిషేధం హామీ మరచి అక్కాచెల్లెమ్మల పసుపు కుంకమలు తుడిచిపెట్టిన పాపం మూటగట్టుకున్నారని విమర్శించారు. నాసిరకం మద్యం దుకాణాల్లో అమ్మించి సామాన్యులకు లివర్, కిడ్నీ వ్యాధులు సోకేలా వ్యవహరించారని మండిపడ్డారు. బటన్ నొక్కడం ఒక్కటే కాదని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కూడా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్న ఇంగితజ్ఞానం కూడా లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అంధకారంలో ఉన్న రాష్ట్ర ప్రజలు చంద్రబాబు పాలనను కోరుకున్నారని తెలిపారు. కూటమిగా బరిలో దిగి ఊహించని విజయాన్ని సాధించారని చెప్పారు. మేనిఫెస్టో ఇచ్చిన హామీలన్నీ చంద్రబాబు అమలు పరుస్తూ అందరి మన్ననలు పొంది పురోగతి వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదోని నియోజకవర్గంలో కబ్జాలు, దౌర్జన్యాలకు పాల్పడడం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి చెల్లిందన్నారు. అధికారం కోల్పోయి ఐదు రోజులు కాలేదని, అప్పుడే కూటమి నాయకులపై మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి నిందలు వేయడం తగదని తెలిపారు. గ్రూపులంటూ నాయకుల మధ్య విభేదాలు సృష్టించేలా సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడడం తగదన్నారు. చంద్రబాబు నాయకత్వంలోనే ఉన్నామని, ఆదోని అభివృద్ధి వైపు నడిచే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గుడిసె శ్రీరాములు, నాయకులు రామ్ భీం నాయుడు, మాజీ సర్పంచి మాధవ్, మాజీ కౌన్సిలర్ మారుతి, రాష్ట్ర నాయకులు విఎం.గోపాల్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

అనారోగ్యంతో ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


పెద్ద పెద్దయ్య (ఫైల్)

మండలంలోని అల సందగుత్తి, బసరకోడు, సలకలకొండ గ్రామాలకు చెందిన వైసిపి ఎంపిటిసి పెద్ద పెద్దయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎంపిటిసి మృతితో అలసందగుత్తి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పెద్దయ్య సతీమణి ఈరమ్మ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బసరకోడు సర్పంచిగా సేవలందించారు. పెద్దయ్య పార్టీలకతీతంగా సుపరిచితుడుగా ప్రజలకు సేవలందించారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పెద్దయ్య మృతి పట్ల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బాబు సారథ్యంలో రాష్ట్రాభివృద్ధి

- టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



విజన్ కలిగిన నాయకులు చంద్రబాబు నాయుడని, ఆయన సారథ్యంలో రాష్ట్ర మరింత అభివృద్ధి చెందడం ఖాయమని టిడిపి సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆదోనిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి వెళ్లి అందరి మన్ననలు పొందాయని తెలిపారు. బటన్ నొక్కడం కాదని, మౌలిక సదుపాయాలు కూడా కల్పించాలని చెప్పారు. ప్రజలు ఓటు ద్వారా జగన్మోహన్ రెడ్డికి బుద్ధి చెప్పారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలంతా భావించి ఘనవిజయం కట్టబెట్టారని తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ఈనెల 12న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబు నాయుడుకు ముందుగానే శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ఆ సభను జయప్రదం చేయాలని కోరారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

- రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

అప్పులబాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు కోరారు. మండలంలోని బోడబండ గ్రామానికి చెందిన వడ్డే బజారి (39) అప్పులబాధ భరించలేక మూడు రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాకు చెందిన కురుగోడు గ్రామంలో క్రిమిసంహారక మందులు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం రైతు సంఘం నాయకులు యు.లక్ష్మీ నరసయ్య, అబ్దుల్లా బోడబండలోని బజారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బజారి కుటుంబానికి ఐదెకరాల సొంత భూమి ఉందని, నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. గత ఖరీఫ్, రబీ సీజన్‌లో పత్తి, మిరప పంటలు వేసి తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. వ్యవసాయ పనుల కోసం కార్పొరేషన్ బ్యాంకులో పొలాన్ని తాకట్టుపెట్టి రూ.8 లక్షలు అప్పు తీసుకుని పొలంలో బోర్లు వేయించారని తెలిపారు. బ్యాంకులో పంటల బీమా చేయించారని, వేసిన బోర్లలో నీరు పడలేదని చెప్పారు. అలాగే వ్యవసాయ పనుల కోసం గ్రామంలోని బయట వ్యక్తుల నుంచి రూ.7 లక్షలు అప్పు చేశారని, అప్పులు మొత్తం రూ.15 లక్షల అయ్యాయని తెలిపారు. అప్పు ఇచ్చిన వారికి సమాధానం చెప్పుకోలేక మనస్తాపంతో వడ్డే బజారి ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. బజారికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.


రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు


చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న తిరుమల రావు

వేసవిలో చిన్నారులకు జ్ఞానం పెంపు

- ప్రధానోపాధ్యాయులు తిరుమలరావు

ప్రజాశక్తి - ఆలూరు

వేసవి సెలవుల్లో చిన్నారులకు జ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడ్డాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమలరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని మొలగవల్లి గ్రంథాలయ అధికారి కె.భాస్కర్ ఆధ్వర్యంలో ఎపి పౌర గ్రంథాలయ శాఖ, రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన 'వేసవి విజ్ఞాన శిబిరం' మొలగవల్లి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కె.విజయభాస్కర్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ అధికారి విద్యార్థులకు కథ చెప్పిన అనంతరం ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కథలు చెప్పించారు. పుస్తక పఠనం చేయించి, విద్యార్థులకు నృత్య ప్రదర్శన చేపట్టారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సర్టిఫికెట్స్ అందజేత

ప్రజాశక్తి - నందవరం

నందవరం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వై.శివరామప్రసాద్ శుక్రవారం విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. గతనెల 4 నుంచి ఈనెల 7 వరకు దాదాపు 30 రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఆశా వర్కర్ రామలక్ష్మి 50 విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, ముగింపు వేడుకల్లో భాగంగా పంచాయతీ అధికారితో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. పిల్లలు రోజూ చదవడం మర్చిపోవద్దని, చదవడం వల్ల జ్ఞానం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రోజూ గ్రంథాలయానికి వచ్చి చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని గ్రంథాలయ అధికారి శివ రామ ప్రసాద్ తెలిపారు. అనంతరం స్వీట్స్, పెన్సిల్ బాక్స్, రంగుల పెన్, పాడ్స్ అందజేశారు.

1104 యూనియన్ డివిజన్ అధ్యక్షులుగా శివ చిరంజీవి

ప్రజాశక్తి - ఆదోని

జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శివ చిరంజీవిని 1104 యూనియన్ డివిజన్ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఆదోనిలోని కార్యాలయంలో డివిజన్ స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం 1104 డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. ఆదోని డివిజన్ ఆఫీసు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంసి.నరప్ప, డివిజనల్ సెక్రటరీగా వి.లక్ష్మన్న, అదనపు కార్యదర్శిగా జి.పాండు రంగా రెడ్డి, ట్రెజరర్‌గా టి.గోవిందరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు.


నాయకులను అభినందిస్తున్న దృశ్యం

మహారాజ శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/అర్బిట్రేటర్ కర్నూలు
డిస్ప్యూట్ నెంబర్ : 97/2023

శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్. కర్నూలు బ్రాంచి. ...డిస్‌పుటెంట్

వర్సెస్

J.Ramesh మరియు 1 ఇతరులు. ...ఆపోనెంట్స్

ఆపోనెంట్స్ 1 నుండి 2 గురికి నోటీసులు

1) J.Ramesh, S/o J.Mohan, H.No.4/70, S.C.Colony, Panchalingala (V), Kurnool (Dist)
2) J.Pratap, S/o J.Mohan, Trafic constable, P.C.No.3232, Kurnool Trafic Police Station, Kurnool.

...ఆపోనెంట్స్

డిస్ప్యూట్ బాకీమొత్తం రూ.96,815-00 రాబట్టుకొనుటకు గాను మీ పైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 నుండి 2వ అపోనెంట్స్ అయిన మీరు 26-06-2024వ తేది రోజున ఉదయం 11.00 గంటలకు మీరుకానీ మీ తరపు న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా : 26-06-2024

బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ చిట్స్/ అర్బిట్రేటర్, కర్నూలు.

మహారాజ శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/అర్బిట్రేటర్ కర్నూలు
డిస్ప్యూట్ నెంబర్ : 111/2023

శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్. కర్నూలు బ్రాంచి. ...డిస్‌పుటెంట్

వర్సెస్

G.Rathnam మరియు 3 ఇతరులు. ...ఆపోనెంట్స్

ఆపోనెంట్స్ 1 నుండి 4 గురికి నోటీసులు

1) G.Rathnam S/o G.Ramudu, H.No.50-705-A6, Birlagate, B-Camp, Kurnool.
2) S.Karimulla S/o Shakshavali, Record Asst, Silver Jubliee Collage, Kurnool.
3) S.Srinivasulu, S/o S.Lakshmanna Binder cum Ruler, Govt Regional Printing Press, Kurnool.
4) G.Anandham, S/o G.Dubbanna, H.No.42-200, Laddagiri, Kurnool (Dist).

...ఆపోనెంట్స్

డిస్ప్యూట్ బాకీమొత్తం రూ.10,51,142-00 రాబట్టుకొనుటకు గాను మీ పైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 నుండి 4వ అపోనెంట్స్ అయిన మీరు 26-06-2024వ తేది రోజున ఉదయం 11.00 గంటలకు మీరుకానీ మీ తరపు న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా : 26-06-2024

బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ చిట్స్/ అర్బిట్రేటర్, కర్నూలు.

మహారాజ శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/అర్బిట్రేటర్ కర్నూలు
డిస్ప్యూట్ నెంబర్ : 102/2023

శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్. కర్నూలు బ్రాంచి. ...డిస్‌పుటెంట్

వర్సెస్

B.Mareppa మరియు 3 ఇతరులు. ...ఆపోనెంట్స్

ఆపోనెంట్స్ 1 నుండి 4 గురికి నోటీసులు

1) B.Mareppa, S/o B.Naganna, Seeds & Finance Business, H.No.4-52, T.Gokulapadu (V), Kallur (M), Kurnool (Dist).
2) P.Jeevarathnam S/o P.Daweed, H.No.3/2, Krishnagiri (M), Kurnool (Dist)
3) S.Nagaraju, S/o Bala Chennaiah, LMD, Divisional Office, Dhone Division, Kurnool (Dist)
4) Boya Srinivasulu, S/o B.Peddaiah, Master Book Keeper, APRIGP. (Value Chain), GUDUR Kurnool (Dist).

...ఆపోనెంట్స్

డిస్ప్యూట్ బాకీమొత్తం రూ.3,60,100-00 రాబట్టుకొనుటకు గాను మీ పైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 నుండి 4వ అపోనెంట్స్ అయిన మీరు 26-06-2024వ తేది రోజున ఉదయం 11.00 గంటలకు మీరుకానీ మీ తరపు న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా : 26-06-2024

బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ చిట్స్/ అర్బిట్రేటర్, కర్నూలు.

మహారాజ శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/అర్బిట్రేటర్ కర్నూలు
డిస్ప్యూట్ నెంబర్ : 98/2023

శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్. కర్నూలు బ్రాంచి. ...డిస్‌పుటెంట్

వర్సెస్

J.Ramesh మరియు 2 ఇతరులు. ...ఆపోనెంట్స్

ఆపోనెంట్స్ 1 నుండి 3 గురికి నోటీసులు

1) J.Ramesh, S/o J.Mohan, H.No.4/70, S.C.Colony, Panchalingala (V), Kurnool (Dist)
2) J.Pratap, S/o J.Mohan, Trafic constable, P.C.No.3232, Kurnool Trafic Police Station, Kurnool.
3) Eeranna S/o M.Sunkanna, Police constable, P.C.No.527, Kurnool Trafic Police Station, Kurnool.

...ఆపోనెంట్స్

డిస్ప్యూట్ బాకీమొత్తం రూ.96,680-00 రాబట్టుకొనుటకు గాను మీ పైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 నుండి 3వ అపోనెంట్స్ అయిన మీరు 26-06-2024వ తేది రోజున ఉదయం 11.00 గంటలకు మీరుకానీ మీ తరపు న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా : 26-06-2024

బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ చిట్స్/ అర్బిట్రేటర్, కర్నూలు.

మహారాజ శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/అర్బిట్రేటర్ కర్నూలు
డిస్ప్యూట్ నెంబర్ : 99/2023

శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్. కర్నూలు బ్రాంచి. ...డిస్‌పుటెంట్

వర్సెస్

G. Chandra Sekhar మరియు 3 ఇతరులు. ...ఆపోనెంట్స్

ఆపోనెంట్స్ 1 నుండి 4 గురికి నోటీసులు

1) G. Chandra Sekhar, S/o. G. Nagaraju, Chargeman, T.G.V. S.R.A.A.C. Ltd., Gondiparla, Kurnool. H.No. 49/50-A-460, Sriram Nagar, Kurnool.
2) P. Nagaraju, S/o. P. Yeranna, Manager, T.G.V. S.R.A.A.C. Ltd., Gondiparla, Kurnool.
3) Govinda Krishna, S/o. Balaraju, Sr. Manager, Oil & Fat, Production Factory Side, T.G.V. S.R.A.A.C. Ltd., Gondiparla, Kurnool.
4) A. Kumar, S/o. K. Anna Swamy, Jr. Superviser, Evopration Factory Side, T.G.V. S.R.A.A.C. Ltd., Gondiparla, Kurnool.

...ఆపోనెంట్స్

డిస్ప్యూట్ బాకీమొత్తం రూ.1,79,555-00 రాబట్టుకొనుటకు గాను మీ పైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 నుండి 4వ అపోనెంట్స్ అయిన మీరు 26-06-2024వ తేది రోజున ఉదయం 11.00 గంటలకు మీరుకానీ మీ తరపు న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా : 26-06-2024

బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ చిట్స్/ అర్బిట్రేటర్, కర్నూలు.

మహారాజ శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/అర్బిట్రేటర్ కర్నూలు
డిస్ప్యూట్ నెంబర్ : 100/2023

శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్. కర్నూలు బ్రాంచి. ...డిస్‌పుటెంట్

వర్సెస్

R. Pullanna మరియు 3 ఇతరులు. ...ఆపోనెంట్స్

ఆపోనెంట్స్ 1 నుండి 4 గురికి నోటీసులు

1) R. Pullanna, S/o. R. Naganna, Flat No. 202, MS9 Laxmi Residency, Ashok Nagar, Kurnool.
2) D. Venkateswarlu, S/o. D. Bala Dasari, S.G. Teacher, M.E.O. Office, Bandi Atmakur (M), Nandyal (Dist)
3) K. Ravi Kiran, S/o. K.C. Rajanna, B.C. Street, H.No. 6-168, Gadivemula (M), Nandyal (Dist)
4) M. Sujatha, D/o. M. Nageswara Rao, Flat No. 202, MS9 Laxmi Residency, Ashok Nagar, Kurnool.

...ఆపోనెంట్స్

డిస్ప్యూట్ బాకీమొత్తం రూ.1,05,850-00 రాబట్టుకొనుటకు గాను మీ పైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 నుండి 4వ అపోనెంట్స్ అయిన మీరు 26-06-2024వ తేది రోజున ఉదయం 11.00 గంటలకు మీరుకానీ మీ తరపు న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా : 26-06-2024

బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ చిట్స్/ అర్బిట్రేటర్, కర్నూలు.

మహారాజ శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/అర్బిట్రేటర్ కర్నూలు
డిస్ప్యూట్ నెంబర్ : 110/2023

శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్. కర్నూలు బ్రాంచి. ...డిస్‌పుటెంట్

వర్సెస్

M. Venkataramanamma మరియు 5 ఇతరులు. ...ఆపోనెంట్స్

ఆపోనెంట్స్ 1 నుండి 5 గురికి నోటీసులు

1) M. Venkataramanamma, W/o. M. Govindu, H.No. 81-210, Kasthuri Nagar, Kurnool.
2) M. Govindu, S/o. M. Pedda Linganna, S Asst. (Hindi Pandit), Z.P.H. School, Stantapuram, Kurnool.
3) M. Rambabu, S/o. P. Narasimhulu, Sr. Asst. Sub-ERO, Gadwal T.S. S.P.D.C.L.
4) P. Ramakrishna, S/o. P. Narasimhulu, S.G. Teacher, Primary School, Mitta Doddi, Gahu(M), Jogulamba Gadwal (Dist).
5) V. Raja Gopala Charyulu, S/o. V. Venkateswara Charyulu, Language Pandit, Grade-II, Z.P.H. School, Krishnapuram (V), Veldurthy (M), Kurnool (Dt.)

...ఆపోనెంట్స్

డిస్ప్యూట్ బాకీమొత్తం రూ.3,82,666-00 రాబట్టుకొనుటకు గాను మీ పైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 నుండి 5వ అపోనెంట్స్ అయిన మీరు 26-06-2024వ తేది రోజున ఉదయం 11.00 గంటలకు మీరుకానీ మీ తరపు న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా : 26-06-2024

బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ చిట్స్/ అర్బిట్రేటర్, కర్నూలు.